క్లుప్తంగా

మునగపాక హైస్కూల్‌కు మెగాఫోన్ బహూకరణ



మునగపాక హైస్కూల్‌కు మెగాఫోన్ సెట్‌ను బహూకరిస్తున్న పూర్వ విద్యార్థి గిరిబాబు

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి పెంటకోట గిరిబాబు బుధవారం మెగాఫోన్ సెట్‌ను బహూకరించారు. తన సోదరుడు శ్రీనివాసరావు జ్ఞాపకార్థం హైస్కూల్‌కు ఉపయోగకరంగా ఉండేలా దీన్ని అందజేశారు. హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

30 మద్యం సీసాలు స్వాధీనం



ట్రైనీ ఎస్‌ఐ పట్టుకున్న మద్యం బాటిళ్లు

నక్కపల్లి: మండలంలో అమలాపురంలో ఒక వ్యక్తి వద్ద 30 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ట్రైనీ ఎస్‌ఐ సాహీబా అంజుమ్ తెలిపారు. బుధవారం అమలాపురంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు చేసి, ఈ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని ఆమె తెలిపారు.

పీఏసీఎస్ ద్వారా గృహ రుణాలు



విలేకర్లతో మాట్లాడుతున్న బుజ్జి

నక్కపల్లి: ఇళ్లు నిర్మించుకునే వారికి పీఏసీఎస్ ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్టు నక్కపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకునే వారికి తక్కువ వడ్డీకి రూ.5 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పీఏసీఎస్‌ల ద్వారా గృహ నిర్మాణాలకు రుణాలు ఇవ్వాలని పాలక వర్గం నిర్ణయించిందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు, సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుణాలు కావాల్సిన వారు ఇంటి పత్రాలను తీసుకుని నక్కపల్లి పీఏసీఎస్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు కోసూరు శ్రీను, మనబాల కొండబాబు, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



మునగపాకలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మునగపాక: ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు కోరారు. మునగపాకలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా దేశ భక్తిని చాటుకోవాలన్నారు. ఈ ర్యాలీ మునగపాకలో అన్ని వీధుల్లోనూ సాగింది. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మళ్ల కాళేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చిన్నారావు, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో పూడిమడక రోడ్డు విస్తరణ పనులు



మునగపాకలో జేసీబీ సాయంతో గృహాల తొలగింపు పనులు

మునగపాక: మునగపాకలో పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా కట్టడాలను జేసీబీ సాయంతో అధికారులు తొలగిస్తున్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న గృహాల తొలగింపులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే మెయిన్ రోడ్డులోని అభయాంజనేయ షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించిన విషయం తెలిసిందే. కొంతమంది టీడీఆర్ బాండ్లు తీసుకున్న నిర్వాసితులు కట్టడాలను తొలగించేందుకు ముందుకు రావడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి.

చినుకు పడితే.. జలమయమే.!

- చిన్నపాటి వర్షానికే రహదారులపై నిలిచిన నీరు
- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరించని కాలువలు, రోడ్లు
- కాలువల్లో పేరుకుపోయిన చెత్త
- పట్టణ వాసులకు తప్పని అవస్థలు



దర్మవరానికి వెళ్లే క్లబ్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



జలమయమైన ఎంపీడీవో కార్యాలయం వీధి రోడ్డు



సౌభాగ్య అపార్టుమెంట్ ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

యలమంచిలి రూరల్: పట్టణంలో కొద్దిపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు మొదలుకొని ప్రధాన రహదారులు జలమయం అవుతున్నాయి. కాలువలు నిండి వర్షపు నీటితో కలిసి రోడ్లపై నిల్వ ఉంటున్నాయి. వాహనదారులు, పాదచారులు, సమీప ప్రాంతాల్లో ఇళ్లలోని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్ల పక్కన డ్రైనేజీలు నిర్మించి వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు తగిన చర్యలు చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీకి పన్నుల రూపంలో భారీగానే ఆదాయం సమకూరుతున్నప్పటికీ అభివృద్ధి పనులు మాత్రం చేపట్టడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టణంలో 25 వార్డులున్నాయి. దాదాపు 55 వేల జనాభా ఉంది. నిత్యం రద్దీగా ఉండే రహదారులపైనే వర్షపు నీరు నిలిచిపోతోంది. యలమంచిలి పంచాయతీగా ఉన్నప్పుడు అప్పటి జనాభా అవసరాలకు తగినట్లుగా దశాబ్దాల క్రితం రహదారులు, కాలువలు నిర్మించారు. 14 ఏళ్ల క్రితం పట్టణం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత రోజురోజుకూ పట్టణం విస్తరించడం, జనాభా పెరగడంతో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా డ్రైనేజీలు, రోడ్లు సరిపోవడంలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పట్టణాభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

రోడ్లా.. చెరువులా.!

కొద్దిపాటి వర్షానికే పట్టణంలో పలు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఎంపీడీవో కార్యాలయం వీధి, సౌభాగ్య బహుళ అంతస్తుల భవనం ఎదురుగా పరమేశ్వరీ సినిమా హాలుకు వెళ్లే రహదారి, ఎల్ఐసీ కూడలి నుంచి గురప్ప కల్యాణ మండపం వరకు, బస్టాండుకు ఆనుకుని ప్రధాన రహదారికి వెళ్లే కూడలి, ప్రధాన రహదారి నుంచి ధర్మవరానికి వెళ్లే క్లబ్ రోడ్డు, కోర్టుపేట ప్రధాన రహదారి, పెదపల్లికి వెళ్లే రోడ్డు సహా నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే రహదారులపై వర్షపు నీరు నిలిచిపోతోంది. వీటిలో కొన్నిచోట్ల యానాద్రి కాల్వలో మురుగునీరు మోకాలి లోతున పొంగి ప్రవహిస్తోంది. మిగిలిన చోట్ల రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చెత్తంతా కాలువల్లోనే..

కాలువల్లో చెత్త చెదారం నిల్వ ఉండడంతో వర్షం కురిసినప్పుడల్లా నీరు సాఫీగా ముందుకు వెళ్లడం లేదు. ఫలితంగా మురుగునీరు రోడ్లు మీదకు వచ్చి చేరుతుండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికితోడు కాలువలు అక్కడక్కడ ఆక్రమణలకు గురై కుంచించుకుపోయాయి. పైగా దుకాణదారులు, హోటళ్ల నిర్వాహకులు ప్లాస్టిక్ వస్తువులు, చెత్తా చెదారం వంటివి కాలువలోకి వేయడంతో మురుగు ప్రవాహానికి అడ్డం పడుతున్నాయి. ఎప్పటికప్పుడు చెత్త తొలగించకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని పట్టణ వాసులు పేర్కొంటున్నారు. పన్నుల రూపంలో మున్సిపాలిటీకి రూ.కోట్లలో ఆదాయం సమకూరుతున్నా డ్రైనేజీలు, రోడ్ల విస్తరణ మాత్రం చేపట్టడంలేదనే విమర్శలున్నాయి. అధికారులు,పాలకులు స్పందించి మురుగు కాలువలను విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీలు నిర్మించాలి



పట్టణంలో రహదారుల పక్కన డ్రైనేజీలు నిర్మించాలి. చాలా చోట్ల డ్రైనేజీలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే రహదారులపై నీరు నిలిచిపోతోంది. నడిచి వెళ్లే వారంతా చాలా ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయి గోతులు కనిపించడం లేదు. నడిచివెళ్లేటప్పుడు వాటిల్లో పడిపోయి గాయపడుతున్నారు.

– పి.రంగసాయి, సీనియర్ సిటిజన్

దుర్గంధం భరించలేకపోతున్నాం..



పట్టణంలో జన సంచారం ఎక్కువగా ఉన్న పలు వీధి రోడ్లపై ఎక్కడికక్కడ రోజుల తరబడి వర్షపునీరు నిలిచిపోతోంది. దీంతో దుర్గంధం భరించలేకపోతున్నాం. దోమలు వృద్ధి చెంది రాత్రుళ్లు కునుకు తీయలేకపోతున్నాం. ప్రధానంగా రహదారుల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలి.

– ఎస్కే ఆసియా, గాంధీనగరం వీధి, యలమంచిలి పట్టణం

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏఈ జగన్

నక్కపల్లి: మండలంలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ జగన్ కోరారు. బుధవారం ఉపమాక సచివాలయంలో ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు వివిధ స్థాయిల్లో నిలిచిపోయిన 6,661 మంది లబ్ధిదారులను గుర్తించామన్నారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుడికి దఫదఫాలుగా రూ.1.80 లక్షలు చెల్లిస్తామన్నారు. తాజాగా ఎస్సీలకు అదనంగా రూ.50 వేలు చెల్లిస్తామని చెప్పారు. ఎస్టీలకు రూ.75 వేలు చెల్లిస్తామన్నారు. పునాది నిర్మించుకునే వారికి గతంలో రూ.20 వేలు లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాలో జమ చేశామన్నారు. బేస్‌మెంట్ పూర్తయితే రూ.15వేలు, గుమ్మాల ఎత్తుకు రూ.30వేలు, స్లాబ్ స్థాయికి రూ.40వేలు, ఇల్లు పూర్తయిన తర్వాత రూ.50 వేలు చెల్లించనున్నట్టు తెలిపారు. ఉపమాక సచివాలయంలో 34 మందిని గుర్తించామన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ కొప్పిశెట్టి బుజ్జి, పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్, వీఆర్వో కామరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కరుణకుమార్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

అచ్యుతాపురం: మాదక ద్రవ్యాల వినియోగం అత్యంత ప్రమాదకరమని అచ్యుతాపురం ఎస్‌ఐ సుధాకర్ అన్నారు. అచ్యుతాపురం మండల కేంద్రంలోని అచ్యుతా జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం యాంటీ డ్రగ్స్ డే నిర్వహించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి కాలేజీలో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కళాశాలల్లో ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు, వినియోగిస్తున్నట్లు సమాచారం ఉంటే 100 కాల్ చేసి తెలపాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. కళాశాలల్లో ర్యాగింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శేషగిరి, ప్రిన్సిపాల్ రాజాన సత్యనారాయణ, ఎస్‌ఐ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్య వేటలో జాగ్రత్తలపై అవగాహన



పూడిమడక మత్స్యకారులతో మాట్లాడుతున్న సీఎస్‌పీఎస్ ఇన్‌స్పెక్టర్ సింహాద్రి నాయుడు

అచ్యుతాపురం రూరల్ : ప్రాణాలు పణంగా పెట్టి సముద్రంలో వేట సాగిస్తున్న మత్స్యకారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూడిమడక సీఎస్‌పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సింహాద్రి నాయుడు అవగాహన కల్పించారు. బుధవారం పూడిమడక కొండపాలెంలోని పంచాయతీ కమ్యూనిటీ భవనంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిచితులు, అనుమానిత వ్యక్తులు తారసపడితే వెంటనే మెరైన్, పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్ ఎస్.రామ్‌కుమార్, వీఆర్‌వో బి.అప్పలరాజు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఈ.శివ, ఇంటలిజెన్స్ బ్యూరో రావత్‌కుమార్, వి.ఎస్.అతుల్, సాగరమిత్ర టి.దేముడుబాబు, మెరైన్ ఎస్‌ఐ బీహెచ్‌వీఎస్ఎన్ రాజు, మెరైన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు



ఒడ్డిమెట్టలో చెత్తను సేకరించే ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. బుధవారం ఆయన ఒడ్డిమెట్ట, దేవవరం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చెత్తను క్లాప్ మిత్రల సాయంతో ఇళ్ల నుంచి సేకరించే కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. కొత్తగా ట్రైసైకిళ్లను అందజేసి వాటి ద్వారా ఇళ్ల వద్దకు వెళ్లి తడి పొడి చెత్తను సేకరించే కార్యక్రమం చేపట్టారు. వీధులు, బావులు, బోర్లు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేయించారు. కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, సర్పంచ్ జి.నర్సింహమూర్తి, కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మరిడిమాంబ అమ్మవారి పండగ



కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారు, విద్యుత్ లైటింగ్

అనకాపల్లి: పట్టణ, మండలంలో పలు ప్రాంతాల్లో గురువారం మరిడిమాంబ అమ్మవారి ఉత్సవాలను నిర్వహించేందుకు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గరపాలెం, కోట్నివీధి, గాంధీనగరం తదితర ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాలను ఇప్పటికే ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు. కోట్నివీధిలో మరిడిమాంబ అమ్మవారి ఉత్సవం పట్టణ పరిధిలో అత్యంత వైభవంగా ప్రతి ఏటా నిర్వహిస్తారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేయనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు.

వైఎస్ జగన్ దృష్టికి అచ్యుతాపురం మండల సమస్యలు



అచ్యుతాపురం మండల సమస్యలపై మాజీ సీఎం వైఎస్ జగన్‌కు వివరిస్తున్న కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, పార్టీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం మండల సమస్యలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి జెడ్పీటీసీ కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ తీసుకెళ్లారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, సీనియర్ నాయకులు కోన లచ్చన్నాయుడు, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు మండలంలో యథేచ్ఛగా జరుగుతున్న గ్రావెల్ దోపిడీని వివరించారు. బార్క్ నిర్వాసిత గ్రామాలైన దోసూరు, దొప్పెర్ల, రావిపాలెం గ్రామాల భూసమస్యపై విన్నవించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేద్దామని వైఎస్ జగన్ సూచించారని నాయకులు తెలిపారు.

మునగపాక: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మునగపాక మండల జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేసేలా కృషి చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు వారు తెలిపారు.

యలమంచిలి రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పార్టీ యలమంచిలి పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, పార్టీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ బుధవారం తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ యలమంచిలి నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కరణం ధర్మశ్రీకి నాయకులంతా సహకరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని, బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం స్పందనను అడిగి తెలుసుకున్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న మహిళా కానిస్టేబుళ్లు దేవీ, రమా

మునగపాక: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మహిళా కానిస్టేబుళ్లు దేవీ, రమా కోరారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పలు పాఠశాలల్లో బుధవారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సన్మార్గంలో నడవాలన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎస్.రాయవరం ఎంపీపీగా కేసుబోయిన వెంకటలక్ష్మి

ఎస్.రాయవరం: మండల పరిషత్ అధ్యక్షురాలి(ఎంపీపీ)గా కేసుబోయిన వెంకటలక్ష్మి మరోసారి ఎన్నికయ్యారు. ఎంపీపీగా ఉన్న ఆమె వ్యక్తిగత కారణాలతో రెండు నెలల క్రితం రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమయింది. ఎన్నికల అధికారి మనోరమ బుధవారం ఎన్నిక నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీటీసీ వియ్యపు సత్యసూర్య విజయకుమారి, ఆమెపై స్వతంత్ర అభ్యర్థిగా అదే పార్టీకి చెందిన ఎంపీటీసీ కేసుబోయిన వెంకటలక్ష్మి పోటీ చేశారు. 19మంది సభ్యులు హాజరైన సభలో 11మంది మద్దతు తెలపడంతో వెంకటలక్ష్మి ఎన్నికైనట్టు అధికారి ప్రకటించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

విలువలను ఖూనీ చేసిన ఎంపీటీసీలపై చర్యలు

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కంబాల జోగులు



విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా పని చేసిన ఎంపీటీసీలపై చర్యలు ఉంటాయని ఆ పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు హెచ్చరించారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బుధవారం జరిగిన ఎంపీపీ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగిన కేసుబోయిన వెంకటలక్ష్మి టీడీపీ మద్దతుతో గెలుపొందారని, అది గెలుపు కాదని అన్నారు. స్వతంత్ర అభ్యర్థి గెలుపునకు సహకరించిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. విలువలకు కట్టుబడి పార్టీ అభ్యర్థికి మద్దతు పలికిన ఎనిమిదిమంది ఎంపీటీసీలకు అభినందనలు తెలిపారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీకి మద్దతు పలకడం మంచి పద్ధతి కాదన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వర్మ, వైస్ ఎంపీపీ చొడిపల్లి అప్పలరాజు, వాకపాడు, రేవుపోలవరం, భీమవరం సర్పంచ్‌లు మైలపల్లి శ్రీనివాసరావు, చోడిపల్లి గోవిందు, గరగా శ్రీనివాసరావు, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన ట్రస్ట్‌బోర్డు కమిటీకి 26లోపు దరఖాస్తు చేసుకోవాలి

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ నూతన ట్రస్ట్‌బోర్డు కమిటీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, అర్హులైన వ్యక్తులు ఈనెల 26వ తేదీలోగా జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని నూకాంబిక అమ్మవారి దేవాలయ సహాయ కమిషనర్ కవిటపు లక్ష్మీ సుధారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ ఆదేశాలు మేరకు కమిటీ సభ్యులుగా దరఖాస్తు చేసుకునే వ్యక్తులు 30 సంవత్సరాల పైబడి, హిందూ ధర్మాన్ని పాటిస్తు, వ్యక్తులపై ఎటువంటి పోలీస్ కేసులు ఉండకూడదని ఆమె పేర్కొన్నారు. కార్యాలయ పనివేళల్లో అర్హులైన వ్యక్తులు దరఖాస్తు అందజేయాలని ఆమె కోరారు.

కొరుప్రోలులో 15 మద్యం బాటిళ్లు పట్టివేత



పట్టుబడిన మద్యం సీసాలతో పోలీసులు

ఎస్.రాయవరం: కొరుప్రోలు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. గ్రామంలో బెల్టు దుకాణానికి మద్యం తరలిస్తుండగా సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేటి నుంచి రెండు రోజుల పాటు నాటిక ప్రదర్శనలు



మాట్లాడుతున్న శ్రీకాంత్

మునగపాక: గ్రామీణ యువజన మందిరం 61వ వార్షిక వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఏటా వార్షికోత్సవంలో భాగంగా నాటిక ప్రదర్శనలు నిర్వహించడం ఆనవాయితీ. ఉమ్మడి విశాఖ జిల్లా ఆహ్వాన నాటిక ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 14,15 తేదీల్లో రెండు రోజుల పాటు నాటిక ప్రదర్శనలు జరిపేందుకు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ విలేకరులతో మాట్లాడారు. నందీశ్వర కళా ప్రాంగణం తులసీ కళావేదికపై రెండు రోజుల పాటు మూడు నాటిక ప్రదర్శనలు నిర్వహించేలా చర్యలు చేపట్టామన్నారు. గురువారం పెందుర్తికి చెందిన శ్రీగౌరీ నటరాజ డ్రమటిక్ అసోసియేషన్ వారిచే 'చీమా.. చీమా.. ఎందుకు కుట్టావ్', అదేరోజు రాత్రి 8.30 గంటలకు పెందుర్తికి చెందిన నటరాజ డ్రమటిక్ అసోసియేషన్ వారిచే 'మాతృదేవోభవ'నాటిక ప్రదర్శన జరుగుతుందన్నారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు మునగపాకకు చెందిన నటరాజ ఆర్ట్స్ వారిచే 'గీత దాటితే'నాటిక ప్రదర్శన జరుగుతుందన్నారు. ఉపాధ్యక్షుడు మళ్ల రామ జగన్నాథం, కోశాధికారి ఆడారి లక్ష్మణరావు, డైరెక్టర్లు బుద్ద నాగు పాల్గొన్నారు.